క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ


ఆరోగ్యశ్రీ కార్డులను గ్రామస్తులకు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరావు

వేపాడ: మండలంలోని శింగరాయి పంచాయతీలో 504 మందికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, పంచా యతీ కార్యదర్శి కన్నంనాయుడు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరే ట్ ఆస్పత్రుల్లో పేదలు వైద్యం చేయించుకునేందుకు ఇది వరకు ఉన్న రూ.5 లక్షల వ్యయ పరిమితిని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచా రన్నారు. పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

ఇంటి వద్దకే పథకాలు


లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: పార్టీలకతీతంగా అర్హులకు పథకాలు మంజూరు చేయడంతో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా వాటిని ఇంటి ముంగిటకే చేర్చుతు న్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని కరకవలస గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రేషన్ లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియ సాంకేతిక కారణాలతో ఇన్నాళ్లూ పూర్తి కాలేదు. వారు రేషన్ డిపోలో సరుకులను విడిపించుకునే వారు. సాంకేతిక సమస్యను పరిష్కరించి తాజాగా మ్యాపింగ్ పూర్తిచేయడంతో లబ్ధిదారులకు ఎండీయూ వాహనం ద్వారా రైస్ డోర్ డెలివరీని ఎంపీపీ గురువారం ప్రారంభించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన


విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని పెదగుడిపాల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. రికార్డులతో పాటు విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీ క్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు.

రూ.2.50 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం


సీసీ కాలువను ప్రారంభిస్తున్న నాయకులు

గుర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసి నాయుడు అన్నారు. పున్నపురెడ్డిపేటలో మండల పరిషత్ నిధులు రూ.2.50 లక్షలతో నిర్మించిన సీసీ కాలువలను గురువారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, నాయకులు రామకృష్ణ, అశోక్ తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి రవిప్రసాద్

బొండపల్లి: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు సంభవించేటప్పుడు ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ప్రమాదం తీవ్రతను తగ్గించవచ్చని గజపతినగరం అగ్నిమాపక కేంద్రం అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ అన్నారు. బోడసింగిపేటలోని సాయిసిద్ధార్థ కాలేజ్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై గురువారం అవగాహన కల్పించారు. వంట గ్యాస్ సిలిండర్లు లీక్ అయ్యి మంటలు వ్యాపిస్తే ఏవిధంగా అదుపు చేయాలి, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్‌లో ప్రమాదాలు సంభవిస్తే ఏవిధంగా బయట పడాలో వివరించారు. కళాశాల కరస్పాండెంట్ శీరంరెడ్డి చంద్రశేఖర్, అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బందిపాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు చుక్కానిలా...

- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి వరంలా ఎస్.కోట గ్రంథాలయం
- అన్ని సౌకర్యాలతో పాటు.. అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు


ఎస్.కోట గ్రంథాలయంలో పాఠకులు

శృంగవరపుకోట: ఉద్యోగార్థుల పాలిట కల్పతరువులా, కొలువుల వేటలో కరదీపికలా నిలుస్తూ ,జ్ఞానాన్ని పంచి, యువత భవితను మారుస్తోంది ఆ గ్రంథాలయం. పోటీ పరీక్షలకు సిద్ధమ య్యే వారికి ఓ చుక్కానిలా ఎస్.కోట గ్రంథాలయం దోహదపడుతోంది. దాతల దాతృత్వంతో అసౌకర్యాలను అధిగమించి, ఉద్యోగార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఇక్కడ నిరు ద్యోగ యువతకు పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని పుస్తకాలు, వసతులు అందుబాటులోకి వచ్చాయి. 2023 జూలైలో డి.శ్రీధర్ ఇక్కడ లైబ్రేరియన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత గ్రంథాలయం తీరు మారింది. అంతవ రకూ అధ్వానంగా ఉన్న గ్రంథాలయానికి కొత్త వెలుగు వచ్చింది. పాఠకుల సౌకర్యాల కోసం లైబ్రేరియన్ పలువురిని కలిసి విరాళాలు సేకరించి ఒక్కొక్కటిగా కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. లక్ష రూపాయలతో పోటీ పరీక్షల పుస్తకాలు, రూ.32 వేలతో 40 రీడింగ్ కుర్చీలు, రూ.12 వేలతో వాటర్ ఫిల్టర్, రీడింగ్ ప్లాంక్‌లు సమకూ ర్చారు. ఉచితంగా వై-ఫై సదుపాయం కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాస్తవంగా లైబ్రరీ వేళలు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకే. అయినప్పటికీ పోటీ పరీక్షలకు సిద్ధమవుతు న్న యువత కోసం రాత్రి 11 గంటల వరకూ గ్రంథాలయాన్ని తెరిచే ఉంచుతున్నారు. గతంలో రోజువారీ పాఠకుల సంఖ్య 40 నుంచి 50 వరకు ఉండేది, నేడు అది 120కి చేరింది. అయితే గ్రంథాలయానికి ఎస్.కోట ప్రధాన రహదారిలో 2001లో సొంత భవనం నిర్మించారు.ఈ భవనం పూర్తిగా శిథిలం కావడంతో 2023లో అద్దె భవనంలోకి లైబ్రరీని మార్చారు. ప్రస్తుతం లైబ్రరీకి నెలకు రూ.6000 అద్దె చెల్లిస్తున్నారు. గ్రంథాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేస్తే మరింత ప్రగతి సాధిస్తుందని పాఠకులు అంటున్నారు.


రీడింగ్ రూమ్‌లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువత


దాతల విరాళాలతో సమకూర్చిన పోటీపరీక్షల పుస్తకాలను పరిశీలిస్తున్న లైబ్రేరియన్

ఉన్నత ఉద్యోగాల కోసం...



ప్రస్తుతం సచివాలయ ఉద్యోగినిగా పనిచేస్తున్నాను. ఉన్నత ఉద్యోగాల కోసం ఉదయమే 8 గంటలకు లైబ్రరీకి వచ్చి కొంత సమయం చదివి డ్యూటీకి వెళుతున్నా. మళ్లీ ఈ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చి రాత్రి వరకూ ప్రిపేర్ అవుతున్నాం. పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్, ప్రశాంత వాతావరణం ఇక్కడ ఉంది. నాలా ఉద్యోగులు, ఉద్యోగార్థులు చాలామంది ఇక్కడికి రోజూ వచ్చి చదువుకుంటున్నారు.

– కె.వీణ, సచివాలయ ఉద్యోగిని

నాలుగు నెలలుగా లైబ్రరీకి వస్తున్నా..



నాలుగు నెలలుగా ఈ లైబ్రరీకి వస్తున్నా. ఉదయం 8గంటలకు వచ్చి రాత్రి 11గంటల వరకూ ఉంటున్నాం. పొరుగు గ్రామాల యువత చాలామంది క్యారేజ్‌లు తెచ్చుకుని ఇక్కడే భోజనం చేసి రోజంతా లైబ్రరీలోనే చదువుకుంటున్నారు. ఏ నోటిఫికేషన్ వచ్చినా అందుకు తగిన మెటీరియల్‌ను లైబ్రేరియన్ శ్రీధర్ మాకు వెంటనే అందుబాటులో ఉంచుతున్నారు.

– డి.ప్రసాద్, కొత్తూరు.

పుస్తకాలను సమకూర్చుతున్నాం..



ఇక్కడికి వచ్చి చదువుకుంటున్న వారంతా పేదకుటుంబాలకు చెందిన యువతే. ఉద్యోగాల సాధన కోసం కష్టపడి చదువుకోవాలని వారికి ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమతలేక పోటీ పరీక్షల పుస్తకాలు కొనలేక ఇబ్బంది పడుతున్నారు. అటువంటి వారి కోసం పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలన్నింటినీ సమకూర్చుతున్నాం. దాతల సహకారంతోనే వసతులు కల్పించాం. శాశ్వత భవనం ఏర్పాటైతే మరింత మందికి ఉపయోగపడుతుంది.

– డి.శ్రీధర్, లైబ్రేరియన్, ఎస్.కోట.

కష్టపడే వారికే ఉజ్వల భవిష్యత్


ఎస్‌ఐ ఉద్యోగం సాధించిన గాయత్రీ కళాశాల పూర్వ విద్యార్థిని సత్కరిస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: విద్యార్థి దశలో కష్టపడి చదువుకునే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్డీఓ బి.శాంతి చెప్పారు. స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఆర్డీఓ శాంతి తో పాటు, సీఐ హెచ్.ఉపేంద్ర అతిథులుగా హాజరయ్యారు. ఇదే కళాశాలలో చదువుకుని ఇటీవల ఎస్‌ఐ ఉద్యోగం పొందిన సీహెచ్.లలితాదిత్య, డీసీసీబీ మేనేజర్‌గా ఉద్యోగం సాధించిన జి.భారతి తో పాటు ప్రస్తుతం ఇక్కడ చదువుతూ జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు.అంతకుముందు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించా యి. కళాశాల కరస్పాండెంట్ దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవ్వా,తాతలు, దివ్యాంగులు, వితంతువులు, వివిధ వ్యాధి గ్రస్తులకు ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే ఠంచన్‌గా సామాజిక పింఛన్ అందుతోంది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛన్ డబ్బులను వలంటీర్లు గురువారం ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న పింఛన్‌దారుల వద్దకు వలంటీర్లు వెళ్లి డబ్బులు అందజేశారు.

– చీపురుపల్లి/గంట్యాడ


చీపురుపల్లి: చీపురుపల్లి సచివాలయం-1 పరిధిలో దివ్యాంగురాలు సన్యాసమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనిత


గంట్యాడ: పెదమదుపాడకు చెందిన సన్యాసప్పడుకు విజయనగరం సర్వజన ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గంగా భవాని

సహారా ఏజెంట్ల నిరసన ర్యాలీ

శృంగవరపుకోట: పట్టణంలో సహారా ఏజెంట్లు, ఖాతాదారులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సహారా సంస్థలో పెట్టిన పెట్టుబడులు చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ స్థానిక సహారా కార్యాలయం ఎదుట పలువురు డిపాజిట్‌దారులు, ఏజెంట్లు ధర్నా చేశారు. అనంతరం వారంతా సహారాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దేవీ జంక్షన్ మీదుగా ఎస్.కోట పోలీస్‌స్టేషన్ వరకూ ర్యాలీ చేశారు. ఈసందర్భంగా సీఐతో వారు మాట్లాడుతూ సహారా సంస్థ పదేళ్లుగా డిపాజిట్లు, పేమేంట్లు చేయలేదని ,సెబీ కేసులు పరిష్కారమయ్యేవరకు ఆగాలని ఇన్నాళ్లు తమకు సంస్థ నచ్చచెప్పిందని వరించారు. స్థానిక కార్యాలయాన్ని నెలరోజులు క్రితం మూసేశారని, ఇప్పుడు ఎవ్వరూ సమాధానం చెప్పడం లేదంటూ వాపోయారు. ఏజెంట్లు మాట్లాడుతూ డిపాజిట్‌దారులు మాఇళ్లకి వచ్చి తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. మేము ఆత్మహత్యలు చేసుకోవడం మినహా మరోదారి లేదని వాపోయారు. తమ గోడు ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందచేశారు.

క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగ అవకాశాలు


క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న ధీర ఫౌండేషన్ అధినేత సందీప్‌బాబు

చీపురుపల్లిరూరల్(గరివిడి): క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొత్స సందీప్‌బాబు అన్నారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గరివిడి మండలంలోని పలుగ్రామాల క్రీడాకారులకు 100 క్రికెట్ కిట్లను గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా ల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం-ఆంధ్రా' టోర్నమెంట్ నిర్వహిస్తున్నారన్నారు. క్రీడలు, విద్యాభివృద్ధికి ధీర ఫౌండేషన్ తరపున తమవంతు కృషి చేస్తున్నామని చెప్పారు.పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, పార్టీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్ప లనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, ముల్లు రాంబాబు, కుమార్, కార్తీక్, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ


దత్తిరాజేరు: సిబ్బందితో సమావేశమైన ఎంపీడీఓ చంద్రకుమారి


కొత్తవలస: ఎంపీడీఓ రమణయ్యకు స్వాగతం పలుకుతున్న పంచాయతీ కార్యదర్శులు


చీపురుపల్లి: ఎంపీడీఓ శ్వేతకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

దత్తిరాజేరు/బొండపల్లి/చీపురుపల్లి/గుర్ల/మెంటాడ(గజపతినగరం రూరల్)/కొత్తవలస: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దత్తిరాజేరు, బొండపల్లి, చీపురుపల్లి, గుర్ల, గజపతినగరం, కొత్తవలస మండల పరిషత్ అభివృద్ధి అధికారుల(ఎంపీడీఓలు)కు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యింది. వారి స్థానంలో శ్రీకాకుళం జిల్లా నుంచి ఎంపీడీఓలు బదిలీపై ఇక్కడికి వచ్చారు. దత్తిరాజేరు, బొండపల్లి, చీపురుప ల్లి, గుర్ల, గజపతినగరం, కొత్తవలస ఎంపీడీఓలుగా చంద్రకుమారి, హరిహరరావు, డి.శ్వేత, బి.వెంకటరమణ, జయంత్ ప్రసాద్, రమ ణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. వారికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

తహసీల్దార్‌కు బదిలీ

బొండపల్లి: తహసీల్దార్ డి.ఎం.జి.ఎస్.ప్రసాదరావు ఎల్.కోట మండలానికి గురువారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విశాఖపట్నంరూరల్ నుంచి ఎస్.రమణయ్యను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు.

నేడు వి.కృష్ణాపురంలో వైద్యశిబిరం

దత్తిరాజేరు: జగనన్న ఆరోగ్య సురక్ష- 2వ విడతలో భాగంగా వి.కృష్ణాపురంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్న శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారని, సచివాలయ పరిధి ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: గజపతినగరం 11 కేవీ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ అధికారి ఎ.అనంతరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పిడిశీల,సీతారామపురం, బొండపల్లి మండలంలోని ముద్దూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ


పెదనడిపల్లిలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అన్నారు. మండలంలోని పెదనడిపల్లి గ్రామంలో గురువారం పలు అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీషతో కలిసి గురువారం భూమిపూజ చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.2 లక్షల జిల్లాపరిషత్ నిధులతో రచ్చబండ నిర్మాణానికి, రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి, అలాగే రూ.5 లక్షల ఎంపీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరితగతిన పనులను పూర్తి చేయిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పిసిని శ్రీనివాసరావు, సర్పంచ్ పోలరాజు, ఎంపీటీసీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌లకు సన్మానం


చీపురుపల్లి: తహసీల్దార్ సురేష్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసనాయుడు, తదితరులు


మెంటాడ(గజపతినగరం రూరల్): తహసీల్దార్ అరుణ దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక ,జెడ్పీటీసీ తవుడు

చీపురుపల్లి: ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వెళుతున్న తహసీల్దార్ ఎం.సురేష్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, కోరుకొండ దాలయ్య, డిప్యూటీ తహసీల్దార్‌లు సంతోష్, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరంలో..

మెంటాడ(గజపతినగరం రూరల్): తహసీల్దార్ అరుణాదేవికి బదిలీ కావడంతో ఆమెను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఆమె అందించిన సేవలను కొనియాడారు. జెడ్పీటీసీ గార తవుడు తదితరులు పాల్గొన్నారు.

అభినందన


విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

శృంగవరపుకోట: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ఆడుదాం-ఆంధ్ర' క్రీడా పోటీల్లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ మహిళల చాంపియన్‌గా ఎస్.కోట నియోజకవర్గ జట్టు నిలిచిందని మండల క్రీడా కో-ఆర్డినేటర్ పి.శ్రీరాములు తెలిపారు. గత నెల 31న జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో నియోజకవర్గం తరఫున ప్రాతి నిధ్యం వహించిన బి.హారిక, జె.శ్రియాదేవి ఫైనల్స్‌లో సాలూరు జట్టుపై విజయం సాధించారు. వీరిని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు గురువారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తాం


పల్లపుదుంగాడకు నడిచి వెళుతున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చెప్పారు. మండలంలోని ధారపర్తి పంచాయతీలో పల్లపుదుంగాడ, పొర్లు గిరిజన గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో గిరిజనులతో మాట్లాడి వారి అవసరాలు, సమ స్యలను తెలుసుకున్నారు. పల్లపుదుంగాడ- పొర్లు రోడ్డుకు మరమ్మతులు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని, పోడు పట్టాలు జారీ చేయాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. రఘురాజు మాట్లాడుతూ దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడ కు రోడ్డు పనులు చేస్తున్నారని, పల్లపుదుంగాడ-పొర్లు రోడ్డుకు మండల పరిషత్ నిధులు కేటాయిస్తామని, పోడు పట్టాల పంపిణీపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతామని, అన్ని సమస్యలూ పరిష్కా రం చేస్తామని చెప్పారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.సర్పంచ్ సన్యాసిరావు, వైస్ సర్పంచ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు కుమరాంలో ఆసరా సంబరాలు


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

జామి: గజపతినగరం నియోజకవర్గం పరిధిలో ఉన్న మండలంలోని గ్రామాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబ రాలు కుమరాం గ్రామంలోని ప్రకృతి లేఅవుట్‌లో శుక్రవారం నిర్వహించనున్నారు. సంబంధిత ఏర్పాట్లను గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర సయ్య గురువారం పరిశీలించారు. సంబరాలకు హాజరయ్యే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధి కారులు, నాయకులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఏఎంసీ చైర్మన్ వేముల ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవికుమార్, మండల జేసీఎస్ చైర్మన్ శీరెడ్డి చందునాయుడు, నాయకులు కిలారి సూర్యా రావు, కంది నర్సింగరావు, చుక్క వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

4న మెరకముడిదాం మండలంలో..

మెరకముడిదాం: మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రత్నం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గర్భాం గ్రామ సమీపంలోని ఇండియన్ పెట్రోల్‌బంక్ వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో నిర్వహించనున్న ఈ సంబరాలకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కార్పెంటర్ల వినతి


ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కార్పెంటర్లు

గజపతినగరం: వృత్తి పనుల్లో తమకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు మండల కార్పెంటర్లు, కార్పెంట ర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ అండ్లూరి గణేష్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం కలిసి తమ సమస్యలను వివరించారు. 50 ఏళ్లు దాటిన వారందరికి పింఛన్ ఇవ్వాలని కోరారు. తమ దుకాణాల వద్ద వడ్రంగి పనిచేసేటప్పుడు వచ్చే దూళి వల్ల ఇబ్బందులుపడుతున్నామని పక్కనే నివాసం ఉంటున్న వారు, ఇతర దుకాణాల వారు అంటున్నారని, ప్రభుత్వం తమకు ప్రత్యేకంగా దుకాణాల ఏర్పాటుకు స్థలం కేటయించేలా చూడాలని, కార్పెంటర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరా రు. కార్పెంటర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరికతోట జగదీష్, మండల అధ్యక్షుడు ఆచారి సింహాద్రి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.